సాక్షి
మెదక్
బుధవారం । 27 । డిసెంబర్ । 2023



కల్యాణానికి ఏర్పాట్లు షురూ..

కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం వచ్చే నెల 7న నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వివరాలు 8లో ▸



మంచి త'రుణం'

హుస్నాబాద్‌లోని మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్ లింకేజీ ద్వారా టార్గెట్‌ను మించి రుణాలు పొందారు.

వివరాలు 8లో ▸



దత్తాత్రేయ జయంతి..

శ్రీగురుపీఠంలో మంగళవారం దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రేపు బొడ్మట్‌పల్లికి ఆరోగ్యశాఖ మంత్రి



దామోదర రాజనర్సింహ

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లికి గురువారం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్ మంగళవారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జెడ్పీ స్థాయీసంఘ సమావేశాలు వాయిదా

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 28, 29న జరిగే జిల్లా ప్రజాపరిషత్ స్థాయీసంఘం సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈవో శైలేశ్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజా పాలన ప్రారంభ కార్యక్రమం ఉన్నందున సంఘ సమావేశాలు వాయిదా వేసినట్లు తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీల ఎన్నిక

వెల్దుర్తి(తూప్రాన్): ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాలను బలోపేతం చేసేందుకు నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు యాదగిరి మాదిగ తెలిపారు. మాదిగ మహిళా సమైఖ్య జిల్లా అధికార ప్రతినిధిగా మాసాయిపేటకు చెందిన శోభారాణి, విద్యార్థి సమైఖ్య జిల్లా అధికార ప్రతినిధిగా వినోద్‌ను జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంఘాన్ని బలోపేతం చేయడానికి పూర్తి కమిటీలను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు.

డ్రమ్ సీడర్‌తో వరిసాగుపై అవగాహన



డ్రమ్ సీడర్‌తో అవగాహన కల్పిస్తున్న కేవీకే విద్యార్థినులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో డ్రమ్ సీడర్‌తో వరిసాగుపై కేవీకే విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని తునికివద్దగల డాక్టర్.డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు గ్రామానికి చెందిన రైతు పాపయ్య పొలంలో మంగళవారం డ్రమ్ సీడర్‌తో వరిసాగుపై అవగాహన కల్పించారు. ఈ సాగు వల్ల సమయం, కూలీల ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. వరిపైరు సైతం వరుసగా సాలు పద్ధతిలో ఉంటుందని దీంతో పంటకు గాలి, వెలుతురు బాగా అందుతుందని వివరించారు. కార్యక్రమంలో కేవీకే విద్యార్థినులు పూజిత, హారిక, సౌమ్య, మేఘన, ప్రణతి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హవనం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మెదక్ మున్సిపాలిటీ: మండల మహా పడిపూజను పురస్కరించుకొని మంగళవారం మెదక్ అయ్యప్ప దేవాలయంలో గణపతి హవనం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మూలమూర్తుల, నవగ్రహ దిక్పాలక హవనం, క్షేత్ర పాలక బలి ప్రదానం, పూర్ణాహుతి నిర్వహించారు. గురుస్వాములు హరిదాస్, వైద్య రాజు, వేద పండితులు వైద్య రాజు, అంకుశ్‌శర్మ మంత్రోచ్చరణల నడుమ గణపతినల్ హవనం జరిగింది. అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి అశోక్, గురుస్వాములు గంగాలక్ష్మిపతి, రామాంజనేయులు, వీర్ కుమార్, కొండ శ్రీను, సత్యనారాయణ, పురం వెంకట్ నారాయణ, పార్థివనాథ్, శ్రీకాంత్ రెడ్డి, రమేశ్, ఆలయ బాధ్యులు చక్రపాణి, రాజన్ పాల్గొన్నారు. ఆలయంలో బుధవారం మండల మహా పడిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వైద్యరాజు తెలిపారు.

ప్రజాపాలనకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 6 వరకు పల్లెలు, పట్టణాల్లో సభలు
- తెల్లరేషన్ కార్డే ప్రామాణికం
- షెడ్యూల్ పూర్తిచేసిన అధికారులు

మెదక్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఒకటి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టగా మరో ఐదు గ్యారంటీల అమల్లో భాగంగా 'ప్రజాపాలన'కు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. 28 నుంచి జనవరి 6 వరకు జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. అందుకోసం సోమవారం, మంగళవారం ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ కసరత్తు కొనసాగించారు. ప్రజాపాలన విధివిధానాలపై మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులతో అదనపు కలెక్టర్లు సమావేశం నిర్వహించారు. ఇప్పటికే గ్రామాలు, మున్సిపాలిటీలలో వార్డుల వారీగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఏ రోజున ఏ గ్రామంలో సభ నిర్వహించాలనే దానిపై కసరత్తుచేసి షెడ్యూల్ రూపొందించారు. గ్రామసభల నిర్వహణ కోసం నిధులు సైతం విడుదలైనట్లు ఓ అధికారి తెలిపారు.

ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు

ప్రజాపాలన గ్రామసభల నిర్వహణకు పత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి మండలానికి తహసీల్దార్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో రెండు బృందాలను నియమించారు. వారి నేతృత్వంలో పథకాలకు సంబంధించిన వివిధ శాఖల మండల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఒక్కో టీం రోజుకు రెండు గ్రామాల చొప్పున గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సౌకర్యవంతంగా ఉండేలా షెడ్యూల్ రూపకల్పన చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ సందేశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి 28న చదివి వినిపించిన తర్వాత గ్రామసభలు ప్రారంభించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

ప్రత్యేక కౌంటర్లు

ప్రజాపాలనకు సంబంధించి సంక్షేమ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణకు అన్ని పంచాయతీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఆ గ్రామాల్లోని కుటుంబాల సంఖ్యను బట్టి కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. మెదక్ జిల్లా జనాభా 2,13,873 మంది. దాని ప్రకారం 2,138 కౌంటర్లను ఏర్పాట్లు చేయనున్నారు. గ్రామసభ అనంతరం పంచాయతీ కార్యదర్శితో పాటు మండల అధికారులు నియమించే వివిధ శాఖల ఉద్యోగులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. గ్రామంలో ఎంత మంది దరఖాస్తుచేసుకున్నా వారందరి నుంచి స్వీకరిస్తారు. వాటిని ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు వివరాలు అందజేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ రమేశ్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ప్రజాపాలనను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.. ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించిందని, మిగతా ఐదు గ్యారంటీలకు సంబంధించి 28 నుంచి జనవరి 6 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డులో సమావేశాలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అందుకు తెల్లరేషన్ కార్డు ప్రామాణికమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,13,873 రేషన్ కార్డులు ఉన్నాయని, 100 కార్డులకు ఒక్క కౌంటర్ చొప్పున ఏర్పాటుచేసి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా వలసలు వెళ్లినవారు తప్పకుండా గ్రామాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. గృహలక్ష్మి, చేయూత ఫించన్, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, రైతు భరోసా పథకాలకు సంబంధించి అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. ఒక్క ఇంట్లో ఎన్ని పథకాలకు అర్హులున్నా అన్ని పథకాలకు సంబంధించి ఒకే అప్లికేషన్‌లో తెలియజేసి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి మండలానికొక ఇంటర్ నేషనల్ పాఠశాల నిర్మాణం కోసం స్థలాలు సేకరిస్తామని, స్థలనిర్ధారణ కాగానే పాఠశాలల నిర్మాణాలు చేపడతామని అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

డీఈఓ రాధాకిషన్

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 28 నుంచి వచ్చేనెల 6 వరకు జరిగే ప్రజాపాలన గ్రామసభల్లో అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ, మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్ కోరారు. మంగళవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రజాపాలనపై అవగాహన కల్పించారు. గ్రామాలలో కుటుంబాల సంఖ్య ఆధారంగా దరఖాస్తు ఫారాలను అందజేస్తామన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఐదు గ్యారంటీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే దరఖాస్తు ఫారంలోనే తెలియజేయాలని కోరారు. దీనికోసం కుటుంబ యజమాని ఫోటో, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్, గ్యాస్ బుక్, కరెంట్ బిల్ జిరాక్స్ పత్రాలు సమర్పించాలని చెప్పారు. గ్రామసభ కౌంటర్ల ఏర్పాట్ల కోసం ప్రతి పంచాయతీకి ప్రభుత్వం రూ.10 వేలు మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవిత, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన

ఎంపీడీఓ సీతారావమ్మ

రేగోడ్(మెదక్): ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సీతారావమ్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలపై ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 28 నుంచి జనవరి 6 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలు మంజూరు కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

షెడ్యూల్ ఇలా...

28న టి.లింగంపల్లిలోను, 29న చౌదర్‌పల్లి, కొత్వాన్‌పల్లి, జగిర్యాల, ఆర్.ఇటిక్యాల, 30న మర్పల్లి, రేగోడ్, పెద్దతండా, సంగమేశ్వర తండా, జనవరి 2న పోచారం, ప్యారారం, దోసపల్లి, గజ్వాడ, 3న కొండాపూర్, వెంకటాపూర్, సిందోల్, తాటిపల్లి, 4న తిమ్మాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ యాదగిరి అన్నారు. ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, ప్రత్యేక అధికారి నర్సింహారావు, ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ వినీల, తహసీల్దార్ బాలలక్ష్మి, ఏఎస్‌ఐ మల్లయ్య, ఆర్‌ఐ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి



పొగమంచు కప్పేసింది. మంగళవారం చిన్నశంకరంపేటలో ఉదయం 8 గంటలు దాటినా వీడలేదు. దట్టంగా మంచు దుప్పటి కప్పేయడంతో రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు లైట్లను వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. దగ్గరకు వచ్చే వరకు కూడా వారికి ఏమీ కనిపించని స్థాయిలో మంచు కమ్మేసింది. - చిన్నశంకరంపేట(మెదక్)

కేవల్‌కిషన్ ఆదర్శప్రాయుడు

ముదిరాజ్ సంఘం నేత నీలం మధు

చేగుంట(తూప్రాన్): కామ్రేడ్ కేవల్ కిషన్ భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయుడని ముదిరాజ్ సంఘం నాయకుడు నీలం మధు ప్రశంసించారు. మండలంలోని పొలంపల్లి శివారులో మంగళవారం కేవల్ కిషన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవల్‌కిషన్ ఆయన సతీమణి ఆనందబాయిల సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ వెట్టిచాకిరీ, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన కేవల్ కిషన్‌ను భూస్వాములు పొలంపల్లి వద్ద హత్య చేయించారని గుర్తుచేశారు. వందలాది ఎకరాల భూములను పేదలకు పంచి మెదక్ ప్రాంతంలో చెరువులు తవ్వించిన కేవల్ కిషన్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమమంలో కేవల్ కిషన్ కుమార్తె డాక్టర్ వీణాకుమారి, ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు రామకిష్టయ్య, అల్లుడు జగన్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్షయ్, మాజీ ఎంపీపీ అరుణప్రభాకర్, ముదిరాజ్ సంఘం జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.



సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న మధు తదితరులు

ఆయన ఆశయ సాధనకు కృషి

కౌడిపల్లి(నర్సాపూర్): కేవల్ కిషన్ ఆశయ సాధనకు సీఐటీయూ కృషి చేస్తోందని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ తెలిపారు. కేవల్ కిషన్ 64వ వర్ధంతి సందర్భంగా మంగళవారం వెంకట్రావ్‌పేట గేట్ వద్ద ఆటో కార్మికులతో కలిసి కిషన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవల్ కిషన్ పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు, హమాలీలు పాల్గొన్నారు.

జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

అదనపు కలెక్టర్‌కు ఏబీవీపీ వినతి

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా రాజన్న సిరిసిల్ల జిల్లలో ఉండడం వల్ల జిల్లాకు చెందిన నిరుద్యోగులు, ఉద్యోగుల ప్రమోషన్లు, ఉద్యోగాల కల్పన విషయంలో అనేక అవస్థలు పడాల్సి వస్తుందని వాపోయారు. అలాగే పోటీ పరీక్షలలో ఉద్యోగాలను దక్కించుకోవడం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జోనల్ వ్యవస్థతో తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శశికాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, ప్రశాంత్, సుదిక్ష్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

పెండింగ్ చలాన్లు చెల్లించండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్: ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వాహనాలపై గల పెండింగ్ ట్రాఫిక్ చలాన్లను చెల్లించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద సూచించారు. ద్విచక్ర వాహనంతో పాటు ఆటోలకు 20 శాతం రాయితీ కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే కార్లు, జీప్‌లు, భారీ వాహనాలకు 60 శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లు, చిన్న వ్యాపారుల ట్రాఫిక్ చలాన్లకు 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): ఒక చెరుకు లోడ్‌తో వెళ్తున్న లారీ అలాగే మరో ఘటనలో బొలెరో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలు మండల పరిధిలోని కోలపల్లి పాత టోల్ ప్లాజా వద్ద సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం చోటు చేసుకున్నాయి. అర్షద్, సాధిక్ నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు తమ బొలెరో వాహనంలో ప్రయాణిస్తుండగా టోల్ ప్లాజావద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. అలాగే అల్లాదుర్గం నుంచి వస్తున్న చెరుకు లారీ మాగీ ఫ్యాక్టరీ వైపునకు వెళ్తుండగా డివైడర్‌కు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. పాత టోల్‌ప్లాజా వద్ద ఉన్న డివైడర్లను నేషనల్ హైవే అధికారులు తొలగించకపోవడం వల్లే తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్లను తొలగించాలని కోరుతున్నారు.



డివైడర్‌ను ఢీకొన్న వాహనం

రెండో రోజు అదే సందడి..

భక్తులతో కిటకిటలాడిన సీఎస్‌ఐ చర్చి



సిలువ వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

మెదక్ కలెక్టరేట్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిలో మంగళవారం రెండో రోజు అదే సందడి కొనసాగింది. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశ విదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చర్చికి తరలి వచ్చారు. చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఫాదర్‌లు దైవ సందేశాలిచ్చి విశ్వాసకులను ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆలయంలో కానుకలు సమర్పించుకొని చర్చి ప్రాంగణంలోని సిలువ వద్ద క్యాండిల్స్ వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలు జనవరి 1వ తేదీ వరకు జరుగనున్నాయి. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో చర్చి ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ప్రధాన గేట్ వద్ద వాహనాల రద్దీ వల్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు నిరంతరంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు.



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు..

రహదారి పనులకు తీసిన గుంతలో పడి..

చిన్నశంకరంపేట(మెదక్): పొలం పనులకు వెళుతున్న రైతు ప్రమాదవశాత్తు రోడ్డు పనులకు తీసిన గుంతలో పడి గాయపడిన ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాట కిష్టయ్య తన ద్విచక్ర వాహనంపై పొలం వద్దకు వెళుతుండగా సూరారం గ్రామం నుంచి చందంపేట గ్రామాల మధ్యన జరుగుతున్న రోడ్డు పనుల కోసం తీసిన గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. గాయపడిన కిష్టయ్యను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుంతల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



గుంతలో పడిన వాహనం

గ్యాస్ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

13 మంది ప్రయాణికులకు గాయాలు

ములుగు(గజ్వేల్): ములుగు సమీపంలో హవేలి ఫాం వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సు గ్యాస్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 13 మందికి గాయాలయ్యాయి. ములుగు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ వైపు వెళ్తున్న సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హవేలి ఫాం వద్ద హెచ్‌పీ గ్యాస్ కంపెనీకి చెందిన గ్యాస్ లారీని వెనుక నుంచి ఢీ కొంది. దీంతో బస్సులో ఉన్న రహీమొద్దీన్, వినోద్‌కుమార్‌లతో పాటు మరో 11 మందికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్


క్రీడాకారులతో రవీందర్

కొండపాక(గజ్వేల్): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో సోమవారం వాలీబాల్ క్రీడాకారుల కోసం రూ. 20 వేల సొంత ఖర్చులతో కోర్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవిందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ క్రీడాకారులను వెలికి తీయడానికి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న రాజేశ్‌కుమార్ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ మంగవారం వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 27న జార్ఖండ్‌లోని చాండిల్‌లో జరగనున్న జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

ఘనంగా పల్లకీ సేవ



పాపన్నపేట(మెదక్): పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాత సన్నిధిలో మంగళవారం పల్లకీ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్ ఆలయ ఈవో మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి ఊరేగింపు చేపట్టారు. పల్లకీ సేవ పలు వీధుల గుండా కొనసాగి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాకకు చెందిన ముదిరాజ్ కరుణాకర్(45)కు గజ్వేల్‌కు చెందిన ఓ మహిళతో వివాహం జరిగింది. కరుణాకర్ మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. మంగళవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ సమీపంలోని అర్బన్ పార్కులో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సహకారమేదీ?

సొసైటీల పునర్విభజనకు ఎదురుచూపులు

> ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పల్లెల్లోని రైతులకు పట్టు కొమ్మల్లాంటివి. పంట రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు, అందిస్తూ అండగా నిలుస్తాయి. పంటలను కొనుగోలు చేస్తూ సేవలందిస్తాయి. కానీ వీటి విస్తరణను ప్రభుత్వం పట్టించుకోకపోవడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. ఆయా సంఘాల పరిధి ఎక్కువగా ఉండడం, గ్రామాలకు దూరంగా ఉండడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.
>
> -వట్‌పల్లి(అందోల్)

- నాలుగేళ్లుగా రైతుల ఇబ్బందులు
- జిల్లాలో 28 మండలాలు, 53 సహకార సంఘాలు
- మూడు మండలాల్లో ఒక్కటి కూడా లేని వైనం
- ఉన్నవి సైతం గ్రామాలకు దూరంగా..

జిల్లాలో 28 మండలాలుండగా.. 53 సహకార సంఘాలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన అమీన్‌పూర్, మొగుడంపల్లి, నాగలిగిద్ద మండలాల్లో ఒక్క సహకార సంఘం లేదు. కొన్ని మండలాల్లో 8 నుంచి 10 గ్రామాలకు ఒక సహకార సంఘం ఉండగా.. మరికొన్ని చోట్ల మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి ఒకటే ఉంది.

71 వేల మంది సభ్యులు

జిల్లాలోని సహకార సంఘాల్లో 71 వేల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులు ప్రతీ పంట సీజన్‌లో రుణాలు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. కొందరు కొత్తగా రుణాలు తీసుకుంటారు. వీటి కోసం దూరంగా ఉన్న సొసైటీలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన మొగుడంపల్లి, అమీన్‌పూర్, నాగలిగిద్ద మండలాల్లో అయితే ఒక్క సహకార సంఘం లేదు. దీంతో ఆ మండల రైతులు ఇతర మండలంలోని సొసైటీకి వెళ్లాల్సిందే. జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో తక్కువ గ్రామాలుండగా.. మరికొన్ని సొసైటీలకు ఎక్కువ గ్రామాలున్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న సొసైటీలకు రుణాల కోసం, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి రైతులు వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు.

విభజిస్తేనే ప్రయోజనం...

వ్యవసాయంలో రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడే సహకార సంఘాల సేవలు అందుబాటులోకి రావాలంటే వాటిని విభజించాల్సిన అవసరం ఉంది. గతంలో 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను విభజించాలని కోరుతున్నారు. ఒక్కో సొసైటీలో వేలాది మంది రైతులు సభ్యత్వం ఉండగా.. ఏ అవసరం వచ్చినా క్యూ కట్టాల్సి వస్తోంది. ప్రతీ సీజన్ ఆరంభంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు బారులు తీరిన సందర్భాలున్నాయి. ప్రభుత్వం సొసైటీల విభజనపై దృష్టి సారించాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

13 కొత్త సంఘాలకు ప్రతిపాదనలు

ప్రతీ మండలంలో రెండు సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని 2020లో ప్రభుత్వం నిర్ణయించడంతో ప్రస్తుతమున్న వాటికి తోడుగా కొత్త సహకార సంఘాలు ఏర్పడడం ద్వారా సేవలు అందుబాటులోకి రానున్నాయని రైతులు భావించారు. మూడేళ్ల కిందట జిల్లా యంత్రాంగం 13 కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. అమీన్‌పూర్, నాగలిగిద్ద మండలాల్లో రెండేసి చొప్పున, వట్‌పల్లి, మొగడంపల్లి, గుమ్మడిదల మండలం నల్లవెల్లి, కంది మండలం కలివేముల, మునిపల్లి, రామచంద్రాపురం, మనూరు మండలం రాయిపల్లి, కంగ్టి మండలం తడ్కల్, సిర్గాపూర్ మండలం వాసర్‌లో సహకార సంఘాలు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి.


ఖాదిరాబాద్ సహకార సంఘం

ఎటువంటి ఆదేశాలు రాలేదు

సొసైటీల పునర్విభజన అనేది ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉంటుంది. జిల్లాలో సహకార సంఘాల పెంపునకు సంబంధించి గతంలో ప్రభుత్వానికి ఆదేశాలు పంపాం. అప్పట్లో సొసైటీల ఎన్నికల నేపథ్యంలో ఉత్తర్వులు రద్దయ్యాయి. ప్రస్తుతం సొసైటీల పెంపుదలకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే కొత్త ఏర్పాటుపై ముందుకు సాగుతాం.

– ప్రసాద్, జిల్లా సహకార అధికారి

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

కారు, తులంన్నర బంగారం స్వాధీనం

హవేళిఘణాపూర్(మెదక్): వృద్ధ దంపతుల వద్ద నగలు చోరీ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి తులంన్నర పుస్తెలతాడును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్‌రూరల్ ఎస్‌ఐ అమర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ మండలం పాతూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు పొగాకు ప్రమీల, అశోక్ పస్కల మందు వేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 22న రాజన్న సిరిసిల్లకు చెందిన పృథ్వీరాజ్, హరీశ్ పాతూర్‌కు వచ్చి వృద్ధ దంపతులను కలిశారు. తాము పోలీసులమని, మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నామని చెప్పారు. తమ భార్యకు జ్వరం వచ్చిందని పాతూరు పస్కల మందు మీరు వేస్తే తగ్గుతుందని, చిన్నకోడూరులో ఉందని నమ్మబలికారు. కానీ, వృద్ధులు మాత్రం తాము మందును ఇక్కడే అమ్ముతామని, బయటకు రామని నిరాకరించారు. పోలీసులమని చెప్పి బతిమిలాడి కారులో తీసుకెళ్లారు. మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ అని చెప్పి కామారెడ్డి వైపు వెళ్తుండడంతో అనుమానం వచ్చి ప్రశ్నించారు. చివరకు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ వద్ద ప్రమీల భర్త అశోక్‌ను దింపి పోలీస్‌క్వార్టర్స్ ఎక్కడ ఉన్నాయో అడిగి రమన్నారు. అతడు వచ్చేలోపు ప్రమీలను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి నగలు దోచుకొని వదిలిపెట్టి వెళ్లిపోయారు. అక్కడున్న యువకుల సాయంతో మెదక్‌కు చేరుకున్న వృద్ధ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లందుకుంటకు చెందిన హరీశ్, పృథ్వీరాజ్‌గా గుర్తించారు. వెంటనే వారిని అరెస్ట్ చేసి తులంన్నర పుస్తెలతాడు, 20 తులాల పట్టగొలుసులు, కారును స్వాధీనం చేసుకున్నట్లు మెదక్ రూరల్ ఎస్‌ఐ అమర్ తెలిపారు. బాధితులు మాత్రం ఆరు తులాలు పోయినట్లు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేవలం తులంన్నర బంగారంను మాత్రమే సీజ్ చేసినట్లు పేర్కొనడం గమనార్హం.

పోక్సో కేసులో యువకుడికి జైలు

తూప్రాన్: లైగింక వేధింపులకు పాల్పడిన యువకుడికి మంగళవారం జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయమూర్తి పి.లక్ష్మీశారద ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50 వేలు జరిమానా విధించారు. ఎస్‌ఐ శివానందరం తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నవాబుపేట గ్రామానికి చెందిన మహ్మద్ ముస్తాఫా బెగ్ అలియాస్ ముజ్జు(20) అనే యువకుడు 2018లో ఓ బాలికకు మాయమాటలు చెప్పి అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు చంపుతానని బెదిరించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రాజ్‌కుమార్ కోర్టుకు నివేదించగా పరిశీలించిన లక్ష్మీ శారద శనివారం నిందితుడికి శిక్ష విధించినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను అదనపు ఎస్పీ ఎస్.మహేందర్ అభినందించినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి..

వర్గల్(గజ్వేల్): మద్యం సేవించి బైక్ నడిపిన ఇద్దరికి గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక మంగళవారం రెండు రోజుల జైలు శిక్ష విధించారని వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. మల్లారెడ్డిపల్లికి చెందిన దాసరి ఆంజనేయులు, సీతారాంపల్లి తండాకు చెందిన బానోత్ విజయ్ మద్యం సేవించి బైక్ నడుపుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ అనంతరం డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. న్యాయమూర్తి వారికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు

ట్రాక్టర్ కిందపడి కొడుకు మృతి

- సెల్‌ఫోన్ మాట్లాడుతూ తండ్రి డ్రైవింగ్
- ఆడుకుంటూ వచ్చి ట్రాక్టర్ కిందపడ్డ మూడేళ్ల బాబు

శివ్వంపేట (నర్సాపూర్): ట్రాక్టర్ కింద పడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. తండ్రి సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రాక్టర్‌ను తీస్తుండగా ఈ ఘటన జరిగింది. మెదక్‌జిల్లా శివ్వంపేట మండలం బోజ్యతండాలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బోజ్యతండాకు చెందిన కోల మీనా, రాజు దంపతులకు శ్రీధర్ (3) కొడుకు, ముగ్గురు కూతుళ్ల సంతానం. రాజు మంగళవారం పొలం దున్నడం కోసం ఇంటి ఎదుట ఉన్న ట్రాక్టర్‌ను సెల్‌ఫోన్ మాట్లాడుతూ తీస్తున్నాడు. అదే సమయంలో ఆడుకుంటూ ట్రాక్టర్ వద్దకు కొడుకు శ్రీధర్ వచ్చాడు. కుమారుడిని గమనించని తండ్రి.. ట్రాక్టర్‌ను కదిలించాడు. దీంతో శ్రీధర్ ముందు చక్రం కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు కళ్లెదుటే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.


శ్రీధర్ మృతదేహం

ఆలయాల్లో చోరీలు

నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట గ్రామ శివారులోని ఎర్రపోచమ్మ అమ్మవారి ఆలయంలో, కుకునూరుపల్లి పెద్దమ్మ గుడిలో దొంగలు చోరీకి పాల్పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు.

కొండపాక(గజ్వేల్): పెద్దమ్మ గుడి తలుపులు పగులగొట్టి దొంగలు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. కుకునూరుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని ఇటీవల నిర్మించారు. దేవాలయానికి వెళ్తున్న భక్తులు హుండీలో నగదు సమర్పించుకుంటున్నారు. దేవాలయంలోని అమ్మవారి 4 జతల పుస్తెమెట్టెలు, చెవి కమ్మలతోపాటు హుండీని ఎత్తుకెళ్లారు. దేవాలయానికి కొంత దూరంలో హుండీని పగుల గొట్టి నగదును తీసుకెళ్లారు. హుండీలో సుమారు రూ.12 వేలు ఉంటుందని ఏల కిష్టయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఆభరణాలు చోరీకి గురైన అమ్మవారి ప్రతిమ

నారాయణఖేడ్: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట గ్రామశివారులోని ఎర్రపోచమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు నగలు ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపు తాళాలు పగులగొట్టి అమ్మవారిపై ఉన్న సుమారు రూ.10వేల విలువ చేసే రెండుతులాల బంగారం పుస్తెమెట్టెలు, ముక్కు పుడకను చోరీ చేశారు. చోరీల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కల్యాణానికి ఏర్పాట్లు షురూ..

- 7వ తేదీన కొమురవెల్లి మల్లన్న కల్యాణం
- పనులు ప్రారంభించిన అధికారులు
- వీఐపీలకు ఆహ్వానపత్రికలు అందజేత
- భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం జనవరి 7వ తేదీన నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్వామి వారి కల్యాణం ప్రతీ సంవత్సరం మార్గశిరమాసం చివరి ఆదివారం నిర్వహిస్తారు. కల్యాణానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరు కానున్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి కల్యాణం అనంతరం సంక్రాతి పండుగ తర్వాత వచ్చే ఆదివారం నుంచి ఉగాదికి ముందు ఆదివారం వరకు (జనవరి 21 నుంచి ఏప్రిల్ 8 వరకు) 12 వారాలపాటు జాతర కొనసాగనుంది. మూడు నెలలపాటు జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, తదితర రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు హాజరుకానున్నారు.

ఆహ్వానపత్రికలు అందజేత..

కల్యాణానికి సంబంధించి ఆహ్వాన పత్రికలు కూడా సిద్ధం చేసి వీఐపీలకు అందిస్తున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతోపాటు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఆలయ ఈవో బాలాజీ అర్చకులతో కలిసి ఆహ్వానపత్రికలు అందించారు.

సమావేశం లేనట్టేనా?

స్వామివారి కల్యాణానికి, జాతర బహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి కలెక్టర్ ఆధ్వర్యంలో ఆలయంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తారు. కానీ ఈ ఏడాది స్వామి కల్యాణానికి సమయం దగ్గర పడుతున్నా ఇంత వరకు సమన్వయ సమావేశం లేదు. అసలు ఉంటుందా లేదా సందేహం నెలకొంది.

మొదలైన పనులు

కల్యాణానికి సంబంధించి పనులను మంగళవారం మొదలు పెట్టారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో రంగులు వేయడంతోపాటు కల్యాణం జరిగే ఆలయ తోట బావి ప్రాంగణాలను ట్రాక్టర్ సాయంతో చదును చేశారు. అదే విధంగా కరీంనగర్, వరంగల్, యాదగిరి గుట్ట, వేములవాడ, హైదరాబాద్, సికింద్రాబాద్‌తో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్వామి కల్యాణ ప్రచారం నిమిత్తం పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం జరిగే తోట బావి ప్రాంగణాన్ని చదును చేయిస్తున్న ఆలయ సిబ్బంది


ఆలయ ప్రాంగణంలో రంగులు వేస్తున్న దృశ్యం


యాదగిరిగుట్టలో పోస్టర్లు అతికిస్తున్న దృశ్యం

మంచి త'రుణం'

- మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలు
- స్వయం ఉపాధి పొందుతూ ఎదుగుదల
- పీఎం స్వనిధి రుణాల్లో జిల్లాలో హుస్నాబాద్ టాప్
- వీధి వ్యాపారులను గుర్తించి అందజేత


కుట్లు వేస్తున్న గాజుల శ్యామల

> మహిళా సంఘాలు ఆర్థిక పురోగాభివృద్ధికి అడుగులు వేస్తున్నాయి. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగుతున్నారు. హుస్నాబాద్‌లోని మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు టార్గెట్‌ను మించి పొందారు. మరో కోటి రూపాయలు వస్తే జిల్లాలోనే హుస్నాబాద్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అగ్రభాగాన నిలువనుంది. అలాగే, వీధి వ్యాపారులకు ఇచ్చే పీఎం స్వనిధి రుణాల్లో హుస్నాబాద్ టాప్‌లో నిలిచింది. వీధి వ్యాపారులకు బ్యాంకు అధికారులు రూ.కోట్లలో రుణాలు ఇవ్వడం గమనార్హం.
>
> - హుస్నాబాద్

హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 481 స్వశక్తి మహిళా సంఘాల్లో 5,106 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కో గ్రూపునకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు పొందుతున్నారు. ప్రతీ సంఘం ప్రణాళికలు రచించుకుంటూ సీనియార్టీ ప్రకారం బ్యాంక్‌లో రుణాలు పొందుతూ ఆర్థిక అవసరాలను తీర్చుకుంటున్నారు. సభ్యుల ఏకగ్రీవ తీర్మాణంతో అప్పులు తీసుకొని వాటిని కిస్తీల వారిగా అప్పులు చెల్లిస్తూ బ్యాంక్‌లకు నమ్మకం కలిగిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (మార్చి 2024)గాను 99 గ్రూపులకు గాను 8.36 కోట్ల రుణాల టార్గెట్ విధించగా, ఇందులో 85 గ్రూపులు రూ.9.80 కోట్లు టార్గెట్‌ను మించి రుణాలు పొందారు. మరో రూ.1.50 కోట్లకు రుణాల ప్రతిపాదనలు పంపినట్లు మెప్మా సీఈఓ రాజు తెలిపారు. ఈ నిధులు మంజూరైతే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీల కంటే హుస్నాబాద్ మెప్మా అగ్రగ్రామిగా నిలువనుంది. ఈ రుణాలతో మహిళలు ముఖ్యంగా టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడర్, పాడి పశువుల పెంపకం వంటి యూనిట్లను ఎంచుకొని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

వీధి వ్యాపారులకు రూ.కోట్లలో..

హుస్నాబాద్ పట్టణంలోని వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం కింద చేయూతను అందిస్తుంది. ఒక్కో వ్యాపారికి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాన్ని బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్నారు. ఈ ఏడాది హుస్నాబాద్ పట్టణంలో వీధి వ్యాపారుల గుర్తింపుపై సర్వే చేసి 1,566 మందిని గుర్తించారు. ఇందులో 1,365 మంది రుణం కోసం దరఖాస్తు చేసుకోగా, 1332 మందికి మొదటి విడతగా రూ.10 వేల చొప్పున రూ.1.33 కోట్ల రుణం మంజూరు చేశారు. రెండో విడతగా 865 మంది వ్యాపారులకు టార్గెట్ చేయగా, 837 మందిని గుర్తించారు. ఇందులో 712 మందికి బ్యాంక్ అధికారులు సమ్మతం తెలుపగా, 690 మందికి రూ.20 వేల చొప్పున 1.38 కోట్లు రుణం అందజేశారు. మూడో విడతలో 161 మందిలో 154 మంది గుర్తించి 150 మందికి రూ.50వేల చొప్పున రూ.75 లక్షల రుణాన్ని బ్యాంక్ అధికారులు మంజూరు చేశారు. ఈ రుణాలను వీధి వ్యాపారులు క్రమం తప్పకుండా చెల్లిస్తూ, మళ్లీ అధికంగా ఎక్కువ రుణాలు పొందేలా వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారు. పీఎం స్వనిధి రుణాల్లో హుస్నాబాద్ జిల్లాలోనే టాప్‌గా నిలిచింది.


బ్యూటిపార్లర్ నడుపుతున్న శ్రావణపల్లి సంగీత

ఆర్థికంగా ఎదగడానికే..



మహిళలు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. వారు నచ్చిన యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారు. నెలవారి కిస్తీలు సక్రమంగా చెల్లిస్తూ బ్యాంకులకు నమ్మకం కలిగిస్తున్నారు. అలాగే వీధి వ్యాపారులకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తున్నాం. జిల్లాలోనే అత్యధికంగా వీధి వ్యాపారులు రుణాలు పొందారు.

– రాజు, మెప్మా సీఈఓ, హుస్నాబాద్

అతిగా మద్యం తాగి మృతి

వర్గల్(గజ్వేల్): తాగుడుకు బానిసై అతిగా మద్యం తాగడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన వర్గల్ మండలం శాకారంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా తిర్విదిపాడుకు చెందిన సోమనపల్లి రమేశ్(50)కు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సిమెంట్ రింగులు తయారు చేసే రమేశ్ బతుకుదెరువు కోసం నాలుగేళ్ల క్రితం కుటుంబంతో సహా వర్గల్ మండలం శాకారం వచ్చాడు. కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. సరిగా తినకుండా అతిగా మద్యం సేవించేవాడు. మంగళవారం ఉదయం ఇంటి వెనుకాల కుర్చీలో కూర్చుని కింద పడి మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతి స్థిమితం లేని మహిళ అదృశ్యం


చేగూరి కౌసల్య

సిద్దిపేటరూరల్: మతిస్థిమితంలేని మహిళ అదృశ్యమైన ఘటన నారాయణరావుపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేటకు చెందిన చెగూరి కౌసల్యకు మూడేళ్ల నుంచి మతిస్థిమితం సరిగాలేదు. ఇప్పటికే పలుమార్లు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయినప్పటికీ పలువురు ఆచూకీ చెప్పడంతో తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు లేచి చూసే సరికి కనిపించలేదు. తిరిగి ఇంటికి వస్తుందని చూసినప్పటికీ రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కౌసల్య ఎరుపురంగు చీర, ఆకుపచ్చ జాకెట్ ధరించింది. కుమారుడు చేగూరి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.